క్లుప్తంగా

భూ సమస్యలు పరిష్కరించాలి



బాడంగి: పినపెంకిలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

బాడంగి/రేగిడి/రాజాం: మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందికి రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం



అంధులకు ఆర్థికసాయం చేస్తున్న విద్యార్థులు

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. విశాఖపట్నం స్వర మాధురి సంస్థకు చెందిన అంధుల(దివ్యాంగులు) బృందం పాఠశాలను మంగళవారం సందర్శించింది. తమ సంస్థ ద్వారా అంధులైన విద్యార్థులకు కంప్యూటర్, సంగీతం, సింగింగ్ వంటివి నేర్పించడంతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నామని తోడ్పాటనందించాలని ఆ సంస్థ ప్రతినిధులు కోరారు. స్పందించిన విద్యార్థులు విరాళాలు సేకరించారు. మొత్తం రూ.26 వేలు వారికి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, కనగల పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



వేణుగోపాలస్వామి వద్ద ఉంచిన రకరకాల పూల బుట్టలు

బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో పుష్పయాగం అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. బెంగళూరు, చిత్తూరు ప్రాంతాల నుంచి తెప్పించిన 12 టన్నుల పూలతో దేవతామూర్తులు, ఆలయాన్ని అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది అంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం, రాజయ్యపేట గ్రామాల్లోని సచివాలయాలను ఆయన మంగళవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి మంచి ఉద్యోగులుగా గుర్తింపు సాధించాలన్నారు. అనంతరం పీఏసీస్ ఈకేవైసీ, హౌస్‌హోల్డ్ జియో సర్వే, సిటిజన్ డేటా ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు.

క్షయ వ్యాధి నిర్మూలిద్దాం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: క్షయ వ్యాధి నిర్మూలిద్దామని పిలుపునిస్తూ మండలంలోని అంబకండి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ నివారణ అధికారి భరతలక్ష్మి, రాష్ట్ర క్షయ వ్యాధి నిర్మూలన కో–ఆర్డినేటర్ స్లోగియాలు.. తొలుత క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి




ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మొక్కజొన్న పంటకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్నఅగ్రహారం, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంట విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు.

- రాజాంలో అన్యాక్రాంతమవుతున్న మడ్డువలస ప్రాజెక్టు స్థలం
- ఆక్రమణదారుల చేతుల్లో 16 ఎకరాల భూమి
- రోజురోజుకూ అధికమవుతున్న అక్రమాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కబ్జా కోరల్లో.. కార్యాలయ భూములు!



రాజాం: వంగర మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు సంబంధించి డివిజనల్ కార్యాలయం, క్వార్టర్స్ నిమిత్తం రాజాంలో కేటాయించిన స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుంది. సరిగ్గా 20 ఏళ్ల క్రితం అమ్మవారి కాలనీ సమీపంలో 22 ఎకరాల ఖాళీ ప్రభుత్వ స్థలాలతో పాటు రైతుల స్థలాలు కేటాయించి, ప్రాజెక్టుకు ఇవ్వగా, 6 ఎకరాల్లో మాత్రమే మడ్డువలస, తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుల కార్యాలయాల నిర్మాణాలు చేశారు. మిగిలిన 16 ఎకరాల ఖాళీ స్థలం ఇప్పుడు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఆ స్థలాన్ని ఆ చుట్టుపక్కల వారు చిన్నచిన్నగా ఆక్రమించుకుని, సొంతానికి వినియోగించుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో సెంటు రూ.50 వేలు..

రాజాంలో మడ్డువలస ప్రాజెక్టు కార్యాలయాల నిమిత్తం కేటాయించిన భూమి విలువ ఇప్పుడు రూ.కోట్లల్లో ఉంది. ఇక్కడ గతంలో ఇరిగేషన్ అధికారుల శిక్షణ నిమిత్తం పక్కా భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి వదిలేశారు. ఇదిలా ఉంటే మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ చేసినా నిర్మాణానికి నిధులు లేకపోవడంతో క్వార్టర్స్ నిర్మాణం ఆగిపోయింది. రాజాం–బొబ్బిలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ ఖాళీ స్థలం ప్రస్తుతం విలువైన స్థలంగా మారింది. ఒక్కో సెంటు ధర రూ.50 వేలు వరకు పలుకుతోంది. ఇక్కడి భూమిని లీజుకు తీసుకునేందుకు అప్పట్లో చాలామంది ప్రయత్నించినా వారి ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో నివసిస్తున్న చుట్టుపక్కల వారు ప్రాజెక్టు ఖాళీ స్థలాల్లో మొక్కలు వేయడం, వాహనాల పార్కింగ్ చేయడం వంటివి చేస్తూ ఆక్రమించుకునే దిశగా పయనిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోకపోవడంతో ఆక్రమణలు అధికమవుతున్నాయి. ఈ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిలో మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కూడా ఉండడం విశేషం.



అదే స్థలంలో ఇలా మొక్కలు వేసి చుట్టూ కంచెలా కర్రలు వేసిన దృశ్యం

కానరాని అధికారుల చర్యలు..

మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల ఎస్ఈలు, డీఈఈలు, ఏఈలు ఈ ప్రాంతంలోని కార్యాలయాల్లో విధుల నిర్వహణకు వచ్చి వెళ్తుంటారు. అయితే వారు కూడా ఇక్కడి ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం తమ ప్రాజెక్టుల భూమి చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయడం చేయడం లేదు. ఫలితంగా ఆ భూమిని ఆక్రమించుకునే వారు రోజురోజుకూ ఎక్కువవుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు సైతం ఆక్రమణలు ఆపే దిశగా దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కోట్ల రూపాయలు విలువ చేసే భూమి ఆక్రమణదారుల వశమైపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం..



మడ్డువలస ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ప్రభుత్వ భూమి ఉన్నది వాస్తవమే. అయితే ఆ భూమి మడ్డువలస అధికారుల పరిధిలో ఉంది. ఆక్రమణల విషయం తమ దృష్టికి రాలేదు. మడ్డువలస అధికారులు కూడా ఆ భూముల ఆక్రమణపై ఫిర్యాదు చేయలేదు. గతంలో ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే వెళ్లి, ఆక్రమణలు తొలగించాం. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలు కనిపిస్తే జిల్లా అధికారులకు నివేదిక ఇస్తాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.కె.రాజు, తహసీల్దారు, రాజాం

ఆయుర్వేద ఆస్పత్రికి తాళం



బొబ్బిలి మండలం, కోమటిపల్లి ఆయుర్వేద వైద్యశాలకు మంగళవారం తాళం వేశారు. సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాకపోవడంతో వైద్య సేవల నిమిత్తం వచ్చిన రోగులంతా నిరాశతో వెనుదిరిగారు. ఇక్కడ ఉండాల్సిన వైద్యులు దీర్ఘకాలిక సెలవులో ఉండగా, ఆస్పత్రి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న వైద్యుడు, ఇతర సిబ్బంది కూడా విధులకు దుమ్మా కొట్టడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అందరూ భావిస్తున్నారు. ఇదే విషయమై ఆస్పత్రి ఇన్‌చార్జ్ వైద్యుడు బి.రాజశేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా, సిబ్బంది శిక్షణలో ఉన్నారని అందుకే ఆస్పత్రి మూసివేయాల్సి వచ్చిందన్నారు. అయితే ఆస్పత్రి సేవలపై పలువురు పెదవి విరుస్తున్నారు. రూ.లక్షల జీతాలు తీసుకుని, సక్రమంగా సేవలందించిన దాఖలాలు లేవని మండిపడుతున్నారు. – బొబ్బిలిరూరల్

భూ వివాదంపై విచారణ



బొబ్బిలి మండలం, గొర్లెసీతారాంపురంలో నెలకొన్న భూ వివాదంపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. సర్వే నంబరు 93/12లో 65 సెంట్ల భూమిని తన పేరు మీద మార్చాలని నగర పోలమ్మ అనే మహిళ వీఆర్‌వో అడపా గౌరీశంకరరావును కోరగా, అతడు ఆమెను కులం పేరిట దూషణకు పాల్పడడంతో ఆమె ఇటీవల పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఇప్పటికే డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేపట్టగా, సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టరును బాధితురాలు కలిసి ఫిర్యాదు చేసింది. కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రానికి చెందిన ఎస్‌డీసీ(విచారణ అధికారి) ఎం.సుధారాణి.. బాధిత మహిళను ఆరాతీయగా, సదరు వీఆర్‌వో తన భూమిని వేరే వ్యక్తి పేరు మీద మార్చి రికార్డులు తారుమారు చేశారని, తన భూమి తన పేరు మీద మార్చాలని అడిగితే అతడు దాడికి ఎగబడినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.శ్రీను, హెచ్‌డీటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

కమ్మేస్తున్న పొగమంచు



రామభద్రపురాన్ని పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 8 గంటల నుంచే మంచు కురవడం ప్రారంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. కనీసం ఎదురుగా వస్తున్న మనిషి కూడా దగ్గరకు వెళ్తే గానీ కనిపించని పరిస్థితి. దీంతో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. ఒకవేళ వెళ్తే టార్చిలైట్లు, సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని మరీ వెళ్తున్నారు. మంచుతో పాటు చలితీవ్రత కూడా పెరగడంతో ఉదయం, రాత్రి వేళల్లో జనం చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. – రామభద్రపురం

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: పట్టణంలో ఎస్ఎల్ఎస్ జ్యూట్‌మిల్లులో ఆక్రమణకు గురికాబోతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న తదితరులు అధికారులను కోరారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయానికి మంగళవారం వెళ్లి, డిప్యూటీ తహసీల్దారు తొగురు సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడిన వారు.. కార్మికులకు సెటిల్‌మెంట్లు చేసి, విక్రయిస్తున్న మిల్లు భూమిలో 2.80 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ స్థలాన్ని ఇప్పటికే కబ్జా చేసేందుకు కొంతమంది పావులు కదుపుతున్నారని ఆరోపించారు. గతంలో ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు కూడా చేయించామని గుర్తుచేశారు.

నవోదయ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన



బహుమతులతో విద్యార్థులు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజాం ప్రాంతానికి చెందిన ఎం.ఎస్.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బూరాడ బాలమోహన్ మంగళవారం నిర్వహించిన నవోదయ మోడల్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరు కాగా, లక్ష్మీపేట పాఠశాలకు చెందిన బౌరోతు భార్గవరావు ప్రథమ స్థానంలో, ద్వితీయ స్థానంలో రేగిడి మండలంలోని కందిశ గ్రామానికి చెందిన కావ్య, పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎస్.లోహిత్, వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌కు చెందిన జి.డిసౌజ్ తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు నగదు బహుమతితో పాటు మెమొంటోలు ఎంఈవో వై.దుర్గారావు, ట్రస్ట్ ఫౌండర్స్ ప్రతినిధులు మీసాల మనోజ్‌కుమార్, మీసాల శ్రావణకుమార్ అందజేశారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



ప్రత్యేక తరగతులను తనిఖీ చేస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులంతా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని నందబలగ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ప్రతిరోజూ పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు ఆయన తెలిపారు. ప్రత్యేక తరగతులతో పాటు, అన్ని సబ్జెక్టులపై తర్ఫీదు ఇచ్చేందుకు 100 రోజుల ప్రణాళికను తయారు చేసి, అమలుచేయాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక తరగతులను పర్యవేక్షించాలన్నారు.

సహారా ఇండియా డిపాజిట్లపై ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: సహారా ఇండియా డిపాజిట్ల చెల్లింపులపై ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం విశాఖపట్నం పర్యటనకు వస్తున్న మోదీని ఉద్దేశించి, స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఖాతాదారుల రూ.84 వేల కోట్ల డిపాజిట్లకు గాను వడ్డీతో చెల్లించాల్సిన రూ.3 లక్షల కోట్లపై విశాఖ సభలో ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని సహారా ఇండియా బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మీదాసు, జిల్లా కమిటీ సభ్యులు పి.ధనుంజయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. సహారా ఇండియాకు కేంద్రం(మోదీ సర్కారు) కొమ్ము కాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సహారా ఇండియా బాధితుల సంఘ నాయకులు టి.పాపారావు, జి.నాగరాజు, పి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడపల్ల పండగ

రేగిడి: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని కాగితాపల్లి గ్రామంలో మడపల్ల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. కిమిడి విశ్వేశ్వరరావు, దూబ సూరపునాయుడు, కిమిడి శ్రీరామ్మూర్తి తదితరులంతా కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు వస్త్రదానం చేశారు.

బాధ్యతల స్వీకరణ

బాడంగి: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఐఎస్(మండల ఇన్ఫర్మేషన్ సోర్స్)గా జి.గణేష్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం కలెక్టరేట్ నుంచి డిప్యూటేషన్‌పై ఇక్కడికి ఆయన వచ్చారని ఎంఈవో రాజేశ్వరి తెలిపారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: మండలంలోని వండానపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి రోహిణీ రాఘవ్.. శిబిరానికి హాజరైన ప్రతిఒక్కరి ఆరోగ్యం తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మరి కొంతమందికి ఆరోగ్య సూచనలు చేశారు.

జాబ్‌కార్డులు మంజూరు చేయండి

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, పనులు కోరిన వారికి తక్షణమే జాబ్‌కార్డులు మంజూరు చేయాలని ఏపీవో సుశీల ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు ఇచ్చే శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. జాబ్‌కార్డు కావాలని అడిగిన వారిలో అర్హులుంటే తప్పనిసరిగా వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ఫారంపాండ్‌లు ఎక్కువగా నిర్మించాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని, వేతనదారులకు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సత్తా

బొబ్బిలిరూరల్: విశాఖపట్నంలోని సింహాచలంలో ఈ నెల 5వ తేదీన జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో బొబ్బిలి మండలంలోని కోమటపల్లి మహాత్మా జ్యోతీరావ్ పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్, హైజంప్ పోటీల్లో ద్వితీయ స్థానం, లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానం, రిలే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



రామభద్రపురం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సూచనలిస్తున్న ఎంపీడీవో రత్నం



తెర్లాం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో రేగి రాంబాబు, ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి కోరారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలకు మంగళవారం ఇచ్చిన శిక్షణలో వారు పాల్గొని, కిశోరి బాలికలఆరోగ్యంపై వారికి తగిన అవగాహన కల్పించాలని సూచించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు, పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి, వెలుగు ఏపీఎం టి.రాము తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, తహసీల్దారు ఎ.సులోచన రాణిలు పాల్గొని, పలు సూచనలు చేశారు. బాలికల ఆరోగ్యం, భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా టీనేజ్ పిల్లలు చెడు వ్యసనాల బారినపడి తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, వారు అలా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: కిశోరి వికాసం కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కిశోరి బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వారిలో రక్తహీనతను అధిగమించేందుకు పాటించాల్సిన ఆహారపు విధానాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం విద్య, వృత్తి నైపుణ్యం, స్వయం ఉపాధి అవకాశాలను ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం సిటీ/రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జోరుగా కొనసాగుతోంది. పెనుబాక గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేయగా, రాజాం మండల పరిషత్ కార్యాలయం వద్ద రూ.2 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్ నిర్మించారు. పెనుబాకలో జరిగిన పనులను జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఆర్ జేఈ ప్రభాకరరావు తదితరులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

రోజుకు రూ.257 వేతనం

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని దేవుదల, అప్పాపురం, మజ్జిరాముడుపేట, గుళ్లపాడు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులతో సమావేశమై, పలు సూచనలు చేశారు. రోజుకు రెండు పూటలా పనిచేయాలని, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని తెలిపారు. హాజరు వేసే సమయంలో ఫొటో అప్‌లోడ్ చేస్తేనే వేతనం పడుతుందన్నారు.



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు